ఓటర్ జాబితాను

క్షుణ్ణంగా పరిశీలించి సిద్ధం చేయాలి

పోలింగ్ బూత్ లెవల్ అధికారులతో సమావేశం

మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాద్

బాన్సువాడ, నవంబర్ 1 : బాన్సువాడలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం పోలింగ్ బూత్ లెవల్ అధికారులతో తహసీల్దార్ వరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలో వసతులతోపాటు ఓటర్ లిస్టులో రెండు పేర్లు ఉన్న వారు, శాశ్వతంగా అడ్రసులో లేనివారు, మరణించిన వారు తదితర తంశాలను బీఎల్వీలు క్షుణ్ణంగా పరిశీలించి, జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. 12డీ ఫారంను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్వీలు వనజ, మల్లీశ్వరి, సునీత, విజయరాణి, జమీలా భేగం తదితరలు ఉన్నారు.

మహిళా సమాఖ్య సమీక్షా సమావేశం

రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

రాజంపేట్, నవంబర్ 1 : రాజంపేట మండల మహిళా సమాఖ్య కేంద్రంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుతారి లక్ష్మి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ.. ఈ సమావేశంలో 22 గ్రామ సంఘాలకు సంబంధించిన అన్ని పుస్తకాలను ఆడిట్ చేసినట్లు చెప్పారు. గ్రామ సంఘాల పుస్తకాలు రాయడంలో మార్పులు, చేర్పుల గురించి గ్రామ సంఘం అసిస్టెంట్లకు వివరించారు. సంఘాల సమావేశాలు యాప్‌లో సంఘాలు, సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంజీ రామచంద్రగౌడ్, ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, సాయిలు, బాగయ్య, రమేశ్, స్వామి అకౌంటెంట్ ప్రశాంతి పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా ప్రచారం

లక్ష్మీరావులపల్లి లో ప్రచారం నిర్వహిస్తున్నా బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్‌ను ఆదరించాలి

- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- నాయకులు, కార్యకర్తల ఇంటింటి ప్రచారం

మాచారెడ్డి, నవంబర్ 1 : జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు బుధవారం ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ హయాం లో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని, బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఇంటింటికీ తిరిగి మ్యానిఫెస్టో గురించి వివరించారు. మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నవీన్, ఉపసర్పంచ్ నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ధర్ని నర్సింహులు, నర్సా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

బీబీపేట్ నుంచి దోమకొండకు బయల్దేరిన బీఆర్ఎస్ నాయకులు

బీబీపేట్, నవంబర్ 1 : దోమకొండలోని జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన మంత్రి కేటీఆర్ సభకు బీబీపేట్‌తోపాటు ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. బీబీపేట్ మండల కేంద్రంతోపాటు మాందాపూర్, జనగామ, ఇస్సానగర్, మల్కాపూర్, తుజాల్‌పూర్, యాడారం, కోనాపూర్, శేరీ బీబీపేట, ఉప్పర్‌పల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయడం కోసం తరలివెళ్లారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్య భవనం ఏర్పాటు చేస్తామనడం హర్షణీయం'

మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కామారెడ్డి, నవంబర్ 1 : జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంగళవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించి ఆర్యవైశ్య సంఘ నాయకులతో కేటీఆర్ ఇష్టగోష్టిలో పాల్గొని కొన్ని విషయాలపై చర్చించారని అన్నారు. అందులో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కామారెడ్డి ఆర్యవైశ్యులకు సంఘ భవనానికి స్థలం, నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించాలని కోరగా కేటీఆర్ స్పందించి తప్పకుండా ఇప్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్పోరేషన్ ఏర్పాటుపై తగిన కృషి చేస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ మన ప్రాంతం అభివృద్ధి చెందాలటే కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ముప్పారపు ఆనంద్, కాంశెట్టి, గౌరి శంకర్, భైరయ్య, రమేశ్‌గుప్తా, లక్ష్మణ్, వేణు, ప్రసన్న, అనిల్, రామకృష్ణ, శ్రీనివాస్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

బాన్సువాడ మండలంలోని కొల్లూర్ శివారులో వడ్లను ఆరబోసిన రైతులు

బాన్సువాడ, నవంబర్ 1 : బాన్సువాడతోపాటు మండలంలోని కొల్లూర్, నాగారం, రైతునగర్, సోమేశ్వర్, దేశాయిసేట్, కోనాపూర్, రాంపూర్, హన్మాజీపేట్, తిర్మలాపూర్, బుడ్మి తదితర గ్రామాల్లో వ్యవసాయ పనుల్లో రైతులు బిజి బిజి అయ్యారు. ఒకవైపు వానకాలంలో వేసిన వరి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోవైపు ముందస్తుగా వరి నాట్లు వేసుకున్న రైతుల పంట కొతలు కావడంతో ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగొలు కేంద్రాల్లో కాంటాలు పెడుతున్నారు. ఇదిలా ఉంటే మరి కొంత మంది కోతలు చేపట్టి ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. మరో నెల రోజులపాటు రైతుల పంటపొలాల పనులు పూర్తి కానున్నాయి.

రేపు టీయూలో పురుషుల కబడ్డీ సెలక్షన్స్

డిచ్‌పల్లి, నవంబర్ 1 : టీయూ పరిధిలోని అంతర కళాశాలల పురుషుల కబడ్డీ జట్ల ఎంపికను టీయూలోని క్రీడా మైదానంలో ఈనెల 3న నిర్వహించనున్నట్లు క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ జి.బాలకిషన్ తెలిపారు. ఎంపికలకు టీయూ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డిగ్రీ కళాశాలలు, పీజీ కళాశాలలు, వృత్తి విద్యా కళాశాలలో చదువుతూ, 17 నుంచి 21 ఏండ్ల వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9వ తేదీన తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని జేఎన్‌టీయూలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్దమల్లారెడ్డిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో మోహన్‌గౌడ్

భిక్కనూరు, నవంబర్ 1 : మండంలోని పెద్దమల్లారెడ్డి, విండో పరిధిలోని ఇసన్నపల్లి, భగిర్తిపల్లి, కంచర్ల, మల్లుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో మోహన్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నదని అన్నారు. సింగిల్ విండోల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను రైతులు ఆశ్రయించవద్దన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కిష్ట య్య, ఏఈవో రవి, సురేశ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొత్తాబాదిలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

బాన్సువాడ రూరల్, నవంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి మండలంలోని కొత్తాబాది గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు.

ఆదర్శ పాఠశాల భవనంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ ఉస్మాన్, పంచాయతీ కార్యదర్శి నవీన్ తదితరులు ఉన్నారు.